# జూనియరూ కాదు. అల్లుడు

నెల్లూరు ప్లీడరు గుమాస్తాలలో చెంచురామయ్య చాల చురుకైనవాడు. వయస్సు పాతికయేండ్లకు మించలేదు; గాని ముసలిగుమాస్తాల కంటె ఆరిందాతనము గలవాడు. మంచి వేషగాడు. క్రొత్త కక్షిదారులు అతడే ప్లీడరని భ్రమపడుచుందురు. చాలఠీవి గలవాడు. సైకిలు లేనిదే యెక్కడకును వెళ్ళడు. ప్లీడరు చెంచయ్య పంతులును, చెంచురామయ్యను ఒకచోట నిలిపిన చెంచురామయ్య ప్లీడరువలెను, చెంచయ్యపంతులు ఆరితేరిన గుమాస్తా వలెను ఉందురు. చెంచయ్య భార్య తఱచు "చెంచురామయ్యను చూసి నేర్చుకోండీ దర్జా. నియ్యోగులింట్లో పుట్టేరు. దర్జాలేనిదే యేమి అందమూ? వైదీకి అయినా అతణ్ణి చూస్తే ముచ్చటవుతుంది" అని పలుకుచుండును. భర్త ప్రత్యుత్తర మామెకు ఎప్పుడును తృప్తినీయదు.

చెంచురామయ్య వ్యవహారము బాగుగనేయుండును; గాని తఱిచిన నేమియు లేదు. తలమంచిలో నాతనికి చిన్నపూరియిల్లు మాత్రమున్నది. ఇంట తల్లి తప్ప మఱి దిక్కులేదు. పెండ్లి కాలేదు.

"అమ్మా, ఈ వయస్సులో పెళ్ళాం వుండవలిసిందే. నువ్వు చెప్పే మాటల్లో యేమీ తేడాలేదు. అయితే పెళ్ళాం వస్తే యేంతింటుందో చెప్పు. రెక్క ఆడకపోతే డొక్క మాడుతుంది. ఇంతకీ వున్నా వుండకపోయినా వెనకదక్షత యేదీ? నాకు నేనయి పిల్లని చూసుకోవడం కుదరదు. ఇప్పటిమట్టుకు నాకు పెళ్ళికాలేదని బెంగలేదు. నువ్వు వున్నంతకాలమూ అన్నం వండిపెట్టడానికి వెనక్కితీయవుగదా? తరువాత చూసుకుందాం" అని యాతడు పెండ్లి ప్రస్తావము వచ్చినప్పుడెల్ల తల్లికి ప్రత్యుత్తరము ఇచ్చుచుండును. "కట్టుకోవడానికి శుభ్రమైన బట్ట, తినడానికి దర్జా అయిన తిండీ, ఇంతే చాలు నాకు. ఎంత దరిద్రుడికేనా పెళ్ళాం అంటే ఆశ లేకపోదు; గాని దర్జా సాగించుకోలేనివాడు పెళ్ళాడగూడదని నామతం. ఎప్పటికైనా నేనైశ్వర్యవంతుడినయినా కావాలి, అయిశ్వర్యవంతుడి కూతుర్నేనా పెళ్ళాడాలి. మూడోదారి పనికిరాదు నాకు" అనిగూడ అతడు చెప్పుచుండును.

రాజమహేంద్రవరమున హితకారిణీ పాఠశాలలో చెంచురామయ్య అంటే ప్రధానోపాధ్యాయునకు అఱవ ప్రాణము. విద్యార్థులందఱును అతని ప్రాణస్నేహితునివలె గౌరవించెడివారు. అందఱకును ఆతడు తలలో నాలుకవలె నుండెడివాడు. "చెంచూ, కూతుళ్ళు లేరోయి నాకూ. ఉంటే నీకొక పిల్లనిచ్చి నిన్ను యింట్లో పెట్టుకుందును. నువ్వు నాకు కడుపున పుట్టిన బిడ్డకంటె యెక్కువ" అని ప్రధానోపాధ్యాయుని భార్య అనుటయు, దానికాతడు "మంచి పిల్లను తీసుకువస్తాను.

మీరే కన్యాదానం చేస్తురుగాని" అని జవాబు చెప్పుచుండుటయు తఱుచు జరుగుచుండెడిది.

## ②

అయిదవఫారము చదువునపుడు తండ్రి చనిపోగా చెంచురామయ్య చదువు మానివేసి తలమంచి చేరుకొనియెను. తల్లికొడుకు ఎట్లు కాలము గడుపుచున్నారో యెవరికిని తెలిసెడిది గాదు. అతని తండ్రి బ్రతికియున్నంత కాలమును భిక్షాటనము చేసి కుటుంబము గడుపుకొనెను. నిలువచేయుటకు తగినంత సంపాదన యెఱుగ డాతడు. అయుద్దేశము గూడ నాతనికి లేదు. "కాలం గడిచిపోతుంది. చాలు" అని యాతడు భార్య నూరడించెడివాడు.

ఒక్క సంవత్సరము గడచినది. "నాయనా, పెంకుటిల్లు కట్టుకోవడం కోసం మీ నాయన జాగ్రత్త పెట్టిన రెండువందల రూపాయలకీ యిక ముప్ఫయి వున్నాయి. ఏదేనా మార్గం చూస్తే గాని కాలం గడవదు మనకి" అని రంగమ్మ చెప్పగా చెంచురామయ్య ఆలోచన ప్రారంభించెను. పదునెనిమిదేండ్లు నిండలేదు. సంసారభారము నెత్తిమీద పడినది. కులాసాగా తిరిగిన చెంచురామయ్య కిది చాల క్రొత్త. వారము దినము లాతనికి మార్గము తోచలేదు. గ్రామములో మారంరెడ్డి బలరామరెడ్డి భార్య లక్షలకు అధీశ్వరియై యున్నది. కొడుకు మైనరు. వ్యవహారమంతయు నామె స్వయముగ చూచుకొనుచుండెను.

"మా అబ్బాయికి చదువు చెప్పు. నీకుటుంబం నేను పోషిస్తాను" అని యామె చెప్పగా తల్లి యనుమతి మీద చెంచురామయ్య అంగీకరించెను.

అయిదు సంవత్సరములు గడచినవి. బలరామరెడ్డి కొడుకు పెద్దవాడై స్వతంత్రుడయ్యెను. వ్యవహారమంతయు తల్లి కొడుకున కిచ్చివేసెను. "మీరు నన్ను విడవవద్దు. మదరాసున నేను వర్తకం చేస్తాను. అక్కడ మీ సాయం నాకు చాలా కావాలి" అని యాతడు కోరెను. చెంచురామయ్య అంగీకరించెను; గాని తల్లి వలదనెను. "పెళ్ళి అయిందాకా యిల్లు కదలవద్దు. తరవాత నీయిష్టం" అని యామె చెప్పెను. చెంచురామయ్య ఆమెకు ఎదురు చెప్పజాలకపోయెను.

## ③

చెంచురామయ్య శక్తి చెంచయ్య పంతులు బాగుగా నెఱుగును. తలమంచిలో నుపాధ్యాయుడుగా నున్నపుడాతడు బలరామరెడ్డితాలూకు కోర్టువ్యవహారములన్నియు తనవద్దకే తెచ్చి అభియోగ విన్యాసమున అమూల్యములగు సలహాలనిచ్చుచుండుట జూచి యాతడు "చెంచురామయ్య బుద్ధిశాలి. పరీక్షల అడ్డులేకపోతే వకీలుగా వుండతగ్గవాడు" అని యనుకొనియెను.

అతనికి ఆ యువకునిమీద చాల లోభము కలిగెను. "తలమంచిలో నీకేమి ముట్టుతుందయ్యా? సంసారం మాత్రం జరిగిపోతూవుంటే యేమిలాభమూ? కాలూ, చెయ్యీ వంగిన తరువాత - అప్పటికేమైనా కూడబెట్టుకోకపోతే అప్పుడు యేం చేస్తావూ? మీ యమ్మ ముసలిదిగదా? ఆవిడీనీకుయెన్నాళ్లువండిపెట్టగలదూ? యుక్తవయస్సులోనే పెళ్ళాడకపోతే ఆవిడ కదలలేని స్థితి వచ్చేక నీకు విస్తరిలోకి అన్నం యెలా వస్తుందీ?" ఇట్టి ప్రశ్నలధికమయ్యెను. తుదకొకనాడు, "పోనీ, నెల్లూరు రావయ్యా; నీకిష్టం వుంటే నాదగ్గిర వుండు. నీకు సర్వస్వాతంత్ర్యం ఇచ్చేస్తాను. కాలం గడిచిపోతూనే వుంటుంది. పెళ్ళి ప్రయత్నాలు చేస్తాను" అని చాల దృఢముగా చెప్పెను.

ఈ ప్రస్తావము వచ్చునప్పటికి అక్కడ బలరామరెడ్డి కొడుకు పెద్దవాడై మదరాసు ప్రస్తావము తెచ్చియుండెను. చెంచురామయ్య సంగతి యంతయు తల్లి కెఱింగించెను. తల్లియు, కొడుకును కష్టసుఖము లాలోచించుకొనిరి. రంగనాయకుని తిరునాళ్ళకు ఆమె నెల్లూరు వచ్చెను. చెంచయ్య పంతులును, భార్యయు, బిడ్డయు వారిని ఆలయములో కలిసికొనిరి. పరోక్షపరిచయముగల గృహస్థులు ప్రథమసమావేశమున చేసికొను మర్యాదలన్నియు జరిగెను. చెంచయ్య "మా యింటికి రండి; మీరెక్కడా మకాము చేయడానికి వీలులేదు" అనియెను. అతని భార్య వేంకటసుబ్బమ్మ రంగమ్మను విడువలేదు. "అమ్మమ్మగారూ, మా యింటికే రావాలి మీరు. మీ బస యెక్కడో రండి. మీ సామాను మా యింటికి పట్టించుకొని వెడదాము" అని సుబ్బలక్ష్మి చేయిపట్టుకొనియెను. చెంచురామయ్య ఆశ్చర్యపడెను. రంగమ్మ నిశ్చేష్టయయ్యెను. "చూడవద్దు. తప్పులేదు" అని చెంచయ్యపంతులు మఱల చెప్పగా వారు అంగీకరించిరి. రంగమ్మ, వేంకటసుబ్బమ్మ, సుబ్బలక్ష్మి మోటారులో ఇంటికి వెడలిపోయిరి. పంతులును, రామయ్యయు కాలినడకను బయలుదేరిరి.

కాశికాలవారి అగ్రహారములో చెంచయ్య పంతులు ఒక్కడే ప్లీడరు. తక్కినవారు చిన్న యుద్యోగులు, ప్లీడరుగుమాస్తాలు, బిడ్డలకు ఇంగ్లీషు చెప్పించుకొనుటకు వచ్చినవారు - ఇంక నిట్టివారు ఉండిరి. యథాప్రకారముగ మధ్యాహ్నము ఇరుగుపొరుగు స్త్రీలు వేంకటసుబ్బమ్మ చుట్టును కూర్చుండిరి. రంగమ్మ వారిలో గూర్చుండుటకు మొదట లజ్జించెను; గాని తప్పినదిగాదు. సుబ్బలక్ష్మి యామెను బలవంతముగ చేయిపట్టుకొని తీసికొని వచ్చి కూర్చుండబెట్టెను. వేంకటసుబ్బమ్మ యామె నందఱకును పరిచయపరిచెను. కొందఱు వేంకటసుబ్బమ్మ యౌదార్యమును రంగమ్మకు చెప్పిరి. రంగమ్మ తన సంసారము సంగతి కొంచెము చెప్పెను. ఈ స్వల్పపరిచయమునందే వారు రంగమ్మ మధురభాషిణి యగుట గ్రహించిరి. అందఱును గూడ "మీయబ్బాయి కేదేనా వుద్యోగం దొరక్కపోదు. చెంచయ్యపంతులుగారికీ మీ అబ్బాయికీ స్నేహం గదా! వారేదేనా ఇప్పిస్తారు. వారికి ఈ వూళ్ళో చాలా పలుకుబడి వుంది. మీరిక్కడికి

రండీ" అని పిలిచిరి. "ఎక్కడో ఇప్పించడం ఎందుకూ? వారి అబ్బాయి మా యింట్లోనే వుండవచ్చును. మా వ్యవహారాలు అన్నీ చూసిపెడుతూ స్వతంత్రంగా మసులుకోవచ్చును" అని వేంకటసుబ్బమ్మ అనియెను. "అమ్మమ్మగారూ, మీరు తప్పకుండా రావాలండీ మావూరూ? మామయ్యగారు నాకు చదువుచెబుతారు. మీరు పాటలు చెబుదురుగాని. అమ్మా, అమ్మమ్మ గారు వస్తే వుత్తరపింట్లో వుంటారే. నీటి కొళాయి ఆదొడ్లో గూడా వకటి వుంది. అవునండీ అమ్మమ్మగారూ; ఏమీ కష్టం వుండదు మీకు. సుఖంగా వుండవచ్చును. నేను మీకు సాయమవుతూ వుంటాను లెండి. తప్పకుండా చెబుతాను. వీరిని మళ్ళీ తలమంచి వెళ్ళనివ్వగూడదే" అని సుబ్బలక్ష్మి పలుకగా అందఱును "ఇంకేమీ? ఈమాటు రంగమ్మగారు తప్పకుండా రావలందే" అనిరి. "నీకు అంత అభిమానం వుంటే అలాగే వస్తానులే అమ్మా" అని రంగమ్మ సుబ్బలక్ష్మిని ఒడిలోనికి దీసికొనియెను.

## ④

"అత్తగారూ, మీయిష్టం. మీకు యిష్టం వుంటే మా యింట్లో మీ యిష్టం వచ్చినచోట వుండవచ్చు. ఇలా అంటున్నానని మీరు మరివకలాగు భావించవద్దు. మీ సౌకర్యం చూసుకోండి. మీకూ మాకూ యేమీ భేదం వుండగూడదు. మధ్వపతివారి వీధిలో మాకు చిన్న యిల్లు వుంది. అక్కడో, యిక్కడో, యెక్కడో వకచోట – మీ యిష్టం. అద్దె యివ్వక్కర్లేదు. ఇక్కడ వుండడం నాయభిప్రాయం" అని పంతులు చెప్పగా వేంకటసుబ్బమ్మ అందుకొనియెను. "బాగానేవుంది మీధోరణి. యెక్కడో వకచోట వుండేటట్టయితే వారిని మనం యీవూరు రమ్మనడం యెందుకూ? పిన్నిగారూ; మీ అల్లుడుగారి మాటలకేమిలెండి. వారు "ఇక్కడే వుండాలి" అంటే మీరేమనుకుంటారో అని అలా అన్నారు. అంతే. మీరు మాయింట్లోనే వుండాలి. నాకు వెనక దక్షత అట్టే లేదు. మా అత్తగారూ, మాఅమ్మా గూడా వక్క సంవత్సరంలోనే చచ్చిపోయారు. మంచీ, చెడ్డా, కష్టమూ, సుఖమూ చెప్పుకోవడానికి పెద్దదిక్కులేక – ఏదో – మీ అల్లుడుగారు వేలకువేలు సంపాదిస్తూ వున్నా, అయిశ్వర్యం అనంతంగా వున్నా నిజంగా నేను అరణ్యంలో వున్నట్లు వున్నాను. మీరు మాయింట్లోనే – మా యిల్లేమిటి? ఇది మీయిల్లే అనుకోండి. మీయింట్లోనే మేము వున్నామనుకోండి. అమ్మా అంటే అమ్మాయీ అంటే మనం భేదం లేకుండా, తల్లీబిడ్డా ప్రేమతో మసులుకుందాం" అని యామె ఖచ్చితముగా చెప్పెను. "అక్కయ్యగారు మామీద చూపించిన ప్రేమ చాలా గొప్పది; గాని అయితే మీ ఆజ్ఞకి అడ్డు చెప్పలేను; గాని యెక్కడో వకచోట – పోనీ మీ చిన్నయింట్లో వుంటాము. అలా అనుగ్రహించండి" అని మెల్లగా చెంచురామయ్య పలికెను. అమాట ముగియుటయే తడవుగ "చూశావుటే అమ్మా; మామయ్యగారు యెలా చెబుతున్నారో? అలా వల్లగాదే. మనయింట్లోనే వుండాలి వారు

తప్పకుండాను. ఏమండీ? మామయ్యగారూ, నాకు చదువు చెప్పరుటండీ? మీరు మరో యింట్లో వుంటే రాత్రి భోజనాలయిన తరవాత నేను చదువుకోవడం యెలాగండీ? మీరు చీకట్లో యిక్కడికి రోజూ యెలా వస్తారండీ? వల్లగాదు. మీరు యెలాగేనా వస్తే అమ్మమ్మగారు యెలా వస్తారూ? ఆవిణ్ణి విడిచి మేము వుండలేము. బాబయ్యగారూ, మీరు వప్పుకోకండి. అమ్మమ్మగారూ, మామయ్యగారూ యిక్కడే మనయింట్లోనే వుండాలి" అని సుబ్బలక్ష్మి పలుకగా చెంచురామయ్యయు, రంగమ్మయు - ఇద్దరును గూడ ఆదరము పెంపున ఆమెను దగ్గరకు తీసికొనుటకు ఒక్కమాతే చేతులు చాచిరి. రంగమ్మ వెనుకకు తగ్గగా ఆమెను చెంచురామయ్య యెత్తుకొని ముద్దాడెను. "మీరు యింక మాఋమాట చెప్పకండీ అత్తగారూ; మా అమ్మాయి యింక వప్పుకోదు" అని చెప్పి చెంచయ్యపంతులు సుబ్బలక్ష్మి యేర్పాటు చొప్పున ఉత్తరపుటిల్లు ఖాళీ చేయించి వారిని అందు విడియించెను.

## ⑤

"దిక్కుమాలిన శాఖాభేదం యేమీ బాగాలేదండీ యిదీ? నియ్యోగులికీ వైదీకులికీ భేదం యేమిటండీ? ఆచారాల్లో, వృత్తుల్లో యేమీ భేదం లేనప్పుడు వెనక యెప్పుడో పుట్టిన భేదాలు యింకా వుంచుకోవడం యెందుకండీ? పిన్నిగారూ నేనన్నమాటలో యేమయినా తప్పువుందా? మీరు మాయింట్లో యెందుకు భోంచెయ్యకూడదో చెప్పండీ?" అని రంగమ్మ భోజనము చేయుచుండగా వేంకటసుబ్బమ్మ ఎదుట కూర్చుండి యడిగెను. "తప్పులేదమ్మా; మజ్జిగ దగ్గిరపెట్టుకోవడం మరిచిపోయాను. వడ్డించు" అని రంగమ్మ పలికెను. "మజ్జిగలాగే అన్నంగూడా వడ్డించమనాలి" అని నవ్వుచు వేంకటసుబ్బమ్మ మజ్జిగ వడ్డించెను.

వేంకటసుబ్బమ్మ అంతకుముందే భుజించెను; గావున ఇరువురును సావకాశముగా గూర్చుండిరి.

సుబ్బలక్ష్మి వూలుతో మెడపట్టీ అల్లుచు వచ్చి ప్రక్కన గూర్చుండెను.

"ఈకాలపు పిల్లలు మనకాలంలాంటివాళ్ళు కారమ్మా; మనమరాలు మొగుడికి యివ్వడానికి అప్పుడే మెడపట్టీ యెలా అల్లుతోందో చూడు అమ్మాయీ"

"అమ్మమ్మగారూ పాట చెబుతారని వచ్చాను. వేళాకోళాలు చేస్తున్నారు"

"వారేమన్నా ఎదురుమాట పలగ్గూడదమ్మా"

"ఇప్పుడు నేనేమన్నానూ? ఏమండీ అమ్మమ్మ గారూ?"

"ఏమీ లేదమ్మా; మెడపట్టీ అయిన తరవాత పాట చెబుతానులే. అయినా యీకాలపు పాటలు రావు నాకు. అంతా పూర్వకాలం."

"అయితేలెండి. నాకు అవే గావాలి. ఊర్మిళాదేవి నిద్ర చెప్పండి ముందు"

"అలాగే చెపుతానులే అమ్మా"

"మా అమ్మాయికి దైవభక్తి చాలా వుందండీ; ఈకాలపు పిల్ల అయినా పూర్వకాలపు ఆచారాలు కొన్ని యిష్టమే దానికి"

"అయితే సంబంధం యేది నిశ్చయంచేశారూ?"

"కావలి సంబంధం మంచిదేగాని పిల్లాడు నలుపు. నాయుడుపేట సంబంధం డబ్బుకు అంతులేదు గాని వ్యవసాయం చేస్తారుట. తెనాలి సంబంధం నాకు బాగుంది"

"ఇంతకీ మనమరాలు యేమంటుంది? ఏమంటావు సుబ్బా?"

"చెప్పమ్మా సిగ్గుపడకు"

"అమ్మమ్మగారు యేది చేస్తే అది"

"నాతల్లే, నా కూనే"

ఇట్లు చెప్పి రంగమ్మ సుబ్బలక్ష్మిని దగ్గరకు తీసికొనియెను. "అయ్యో, అమ్మమ్మగారు మయిలపడ్డారు. ఇంకా దాహం పుచ్చుకొన్నారో లేదో" అని బాలిక ఇవ్వలకు రాబోయెను; గాని "అయితే లే అమ్మా" యని రంగమ్మ విడువలేదు.

## 6

చెంచురామయ్యను జూచి హెడ్‌గుమాస్తా నిరాశపడెను. అది కనిపెట్టి యాతడు "మీకు నిరాశవద్దు నావల్ల మీకు అపకారం జరగదు" అని చెంచురామయ్య చెప్పెను; గాని యాతనికి ధైర్యము గలుగలేదు. "పంతులుగారు మిమ్మల్ని యెందుకు చేరదీశారూ? మీ ప్రతిభ నాకు తెలుసును. మీ ముందు ఈ వూళ్లో ప్లీడర్లుకూడా చాలామంది తీసికట్టుగా వుంటారు. పంతులుగారి శాస్త్రజ్ఞానానికి మీ మంత్రాంగం వుండవలిసిందే; గాని పదేళ్ళనుంచి యీ గుమ్మం కనిపెట్టుకుని వున్నాను. లోటు లేకుండా జరిగిపోతోంది. మరెక్కడికేనా వెడితే లోటు వుండగూడదు; గాని కొత్త అవుతుంది. ఈలాభం వుండదు. పువ్వులమ్మిన చోట కట్టెలమ్మినట్లు వుంటుంది" అని యాతడు కొంచెము దీనముగ పలికెను. "మధ్యాహ్నం తీరుస్తాను మీభయం" అని చెంచురామయ్య చెప్పెను.

నాడు ఆదివారము దక్షణపుటింటిలోనుండి చెంచయ్యపంతులును, ఉత్తరపుటింట్లోనుంచి చెంచురామయ్యయు భోజనము గావించి ఒక్కమారే హాలులోనికి వచ్చిరి. వెనువెంటనే సుబ్బలక్ష్మి తములపాకుచిలుకల పళ్ళెము తెచ్చి బల్లమీద నుంచి వెడలిపోయెను. చెంచయ్య ఆజ్ఞ చొప్పున చెంచురామయ్యగూడ తాంబూలచర్వణము ప్రారంభించెను.

"తమకి నాయెడల కలిగిన అపారప్రేమని తరుచు వర్ణిస్తూవుండడం నాకు ఇష్టం లేదు. మరి నా పనులు ఏమో సెలవిస్తే చేసుకుంటూ వుంటాను."

"నియామకం యెందుకూ"

"తమవద్ద యిదివరకు వకరు హెడ్డుగుమాస్తాగా వుండి సంసారం చక్కబెట్టుకుంటున్నారు. నారాక వారికి నిరాశావహంగా వుంది. వారికి పెట్టిన అన్నం తీసెయ్యవద్దని నాప్రార్థన"

"ఎందుకు తీసెయ్యాలీ? అతను వుండవలసిందే. నువ్వు నాకు సాహాయ్యం చేయడం గుమాస్తాగా కాదు"

"మఱీ యెలాగా"

"జూనియరుగా"

చెంచురామయ్య చకితుడై చూచెను. "ఆశ్చర్యమెందుకూ? నీ ప్రతిభ నాకు తెలుసును. సుబ్బుకృష్ణయ్య లెక్కలు వగైరా చూసుకుంటూ వుంటాడు. చిన్న గుమాస్తా చిల్లరిపనులు చేసుకుంటూ వుంటాడు. కేసులు పట్టడమూ, మార్గాలు వెయ్యడమూ, గుమాస్తాల పనులు తనిఖీ చెయ్యడమూ, ప్రత్యక్షంలో ప్రతిష్ఠకేనా అప్రతిష్ఠకేనా పేరుమాత్రం నాకు దక్కనియ్యడమూ, కక్షిదార్లవద్ద ఫీజులు మాట్లాడడమూ, నాసంసారమును చక్కపెట్టడమూ అంతా నీది" అని పంతులు చెప్పెను. అంతటితో నూరకుండక ఆతడు సుబ్బుకృష్ణయ్యను పిలిచి "చెంచురామయ్యగారు నాతరవాత నా యంతటివారు. మీరు వారికే జవాబుదారీగా నుండాలి" అని చెప్పెను. అతని మనసు కుదుటబడెను.

ఉత్తరక్షణము మొదలు చెంచురామయ్య తన నిశిత ప్రతిభకు ఉదాహరణములు చూపసాగెను.

పంతులు కోర్టుకు వెళ్ళిన మోటారులో ఎడమదెస చెంచురామయ్య యుండవలెను. మొదటిదినమున ప్లీడరులందఱును ఈ సంఘటనమును జూచి చకితులైరి. మఱునాడు కొందఱు చెంచురామయ్య నడుగగా "వారి మూడో గుమాస్తాగా వున్నా"ననియెను. చెంచయ్య నడుగగా "నా జూనియరు" అనియెను.

వారము దినములు గడిచినవి. పంతులునకు చెంచురామయ్య కుడిభుజముగా నుండెను. ఒక హత్యకు సంబంధించిన అభియోగమున చెంచయ్యపంతులు ముద్దాయి పక్షమున హేతువాదము ప్రారంభించినపుడు చెంచురామయ్య వెనుక నిలిచి కాగితములు త్రిప్పుచు యుక్తుల నందించుటయు, అందులకు ఫలముగా యుక్తియుక్తముగా నుండు చెంచయ్య పంతులు హేతువాదము మఱింత జటిలముగా నుండుటయు జూచి ప్లీడరు లందఱును అబ్బురపడిరి.

ముద్దాయి విడుదలయయ్యెను. ఆతడు లక్షాధికారి. నిర్దోషి; గాని చెంచయ్యపంతులు పూనుకొనకున్న ఆతనిమీద పన్నబడిన కుట్ర తేలకపోయియుండును. ఆతడు ఈ రహస్యమును గ్రహించెను. "నాప్రాణాలిని, అంతకంటే గొప్పదయిన మానాన్ని నిలిపేరు. మీశక్తి తెలిసినది. వ్యర్థుణ్ణి అయినా ఈ చిన్న - స్వీకరించాలి" అనియాతడు నిర్ణయించుకొనిన ఫీజుగాక మఱియొక రెండువందల రూపాయలు బహుమతిగా నీయబోయెను; గాని చెంచయ్య వాని

నంగీకరింపలేదు. "నీకేసు పట్టినవాణ్ణి నేనే. నడిపినవాణ్ణి గూడా నేనే; గాని నడిపించిన వారు చెంచురామయ్యగారు. ఈ బహుమతికి అర్హులు వారూ. వారికి ఇచ్చి సంతోషపెట్టు"మని యాతడు చెప్పెను. చెంచురామయ్య చాలసేపు తన కృతజ్ఞతను తెలిపి సొమ్ము పుచ్చుకోవలసినదని కోరెను; అప్పటికిని పంతులు అంగీకరింపలేదు. "నీనిశిత ప్రతిభకి ప్రకాశం గలిగించడమే నా యభిప్రాయం. ఎవరి ప్రజ్ఞకి వారు ఫలం పొందక తప్పదు. వకరి తెలివితేటల వల్ల వచ్చిన ఫలాన్ని మరివకరు అనుభవించడం చాల తప్పు. ముద్దాయి నాకు తక్కువ యివ్వలేదు. నాకు రావలసినది నాకు ముట్టింది. ఆ రెండువందలూ నీవి. వాదించవద్దు. పుచ్చుకో" అని యాతడు ఖచ్చితముగా చెప్పగా చేయునది లేక చెంచురామయ్య పుచ్చుకొనియెను.

## 7

ఇదియైన తరవాత వరుసగా అయిదారు పెద్దక్రిమినలు కేసులు జడ్జీయెదుట విచారణకు వచ్చెను. అన్నిటియందును ఏదో యొక పక్షము చెంచయ్యకు వచ్చెను. చెంచురామయ్య బుద్ధి తఱచిన కొలదిని నిశితమగుచుండుట జూచి పంతులు పరమానందభరితుడయ్యెను. ఇరువురును గలిసి తమపక్షము వారిని విచారణ చేయునపుడు ఆతితేతీన సాక్షులుగూడ ప్రత్యుత్తరమిచ్చుటకు తడబడసాగిరి. "చెంచయ్యపంతులు మునుపటివాడు కాడు. ఈ పిల్లబాపడు వచ్చేక పంతులు మారిపోయాడు. ఇతని యెదుట నిలిచి జవాబు చెప్పడం యిక కష్టమే" అని చెప్పుకొనిరి. ఇక యెదుటి పక్షపు సాక్షులసంగతి చెప్పనక్కఱయే లేదు. "బోనులో నుంచి విడిస్తే చాలు" అని అందఱును తలంపసాగిరి.

ఈ అయిదారు కేసులయందును చెంచయ్య పంతులు చేసిన హేతువాదము జడ్జీకి గూడా వింతగొలిపెను. "పంతులుగారికి వరప్రసాదం లభించినట్లు వుంది" అని అందఱును చెప్పుకొనసాగిరి. చెంచురామయ్య తమ యింటికి వచ్చిన తరువాత తనకు కలుగుచున్న ఘనత నంతను పంతులు భార్య కెఱింగించెను. ఆమె గూడ చాల నానందించెను.

"అబ్బాయీ, నీకంత వేషం యెందుకురా? పంతులుగారు చూడూ యెలా వున్నారో? లక్షలకు అధికారి. వేలు గడిస్తున్నారు. మోటారు తప్ప భేషజాలేమీ లేవు. మోటారేనా కోర్టుకు తొరగా వెళ్ళడానికి గాని వేషాలికి గాదు. నీ యజమాని నూలుకోటు తొడుగుతూవుండగా నీకు పట్టుకోటు యెందుకు నాయనా? ఆయన ముచ్చెలు తొడుక్కుంటూ వుండగా నీకు దొరల జోడెందుకురా? లోకులాక్షేపిస్తారురా. నామాట వినరా" అని రంగమ్మ ప్రతిదినమూ చెప్పుచుండును; గాని చెంచురామయ్య వినడు. "అత్తగారూ, ఆతణ్ణి మీరెందుకూ ఆక్షేపించకండి. ఈకాలపు మనుష్యులు పూర్వకాలం వాళ్ళలా వుండమంటే వుండరు. ఆతనికిమాత్రం యేమి తక్కువా?"

అని పంతులు ఆతని వేషమును బలపఱుచుచుండును. అట్టిసమయముల యందెల్ల "మీరెందుకు దర్జాగా వుండరూ?" అని వేంకటసుబ్బమ్మ యడుగుచుండును; గాని పంతులు ఎప్పుడును ఒకటే ప్రత్యుత్తర మిచ్చుచుండును. "కాలం మళ్ళిపోయింది. యిక నాకు వేషాలెందుకూ?" ఈ ప్రత్యురము వినినపుడు వేంకటసుబ్బమ్మ "మంచిమాటే" అని విదాలించుచుండెను.

## 8

"అమ్మాయి పెళ్ళిమాట యేమిటి?" అని యొకనాడు వేంకటసుబ్బమ్మ గట్టిగా నడిగెను. "పన్నెండేళ్ళు వెడతాయిట. యింకవుంచడం మంచిదిగాదండి" అని రంగమ్మ గూడ చెప్పెను. "నచ్చిన సంబంధం దొరకడం కష్టంగా వుంది. ఏదో వకటి తీసుకురాగా నువ్వు అంగీకరించడం లేదాయె. ఏం చెయ్యనూ? అత్తగారూ; అమ్మాయికి పెళ్ళి యీడు వచ్చినమాట నిజమే. అయితే పెళ్ళి చేసేముందే మన తెలివితేటలకి వినియోగము. అది కాస్తా అయిపోయేక యేమనుకున్నా యేమీ లాభం లేదు. డబ్బూ, ఉద్యోగాలూ, పెద్ద సంసారమూ, వీట్లకంటె మర్యాదా, అమ్మాయి సుఖమూ మనకి కావలసినవి. సంబంధాలు నేను వెదికి తెస్తాను; గాని అంగీకరించవలసిన భారం మీ అమ్మాయి మీద వుంది. ఏమంటారు?" అని పంతులు బదులు చెప్పెను. ఆలోచన ప్రారంభమయ్యెను. ఏడెనిమిది సంబంధములు గుఱించి సంపూర్ణవిమర్శనములు ముగిసెను; గాని ఏదియు నచ్చలేదు. "మంచి సంబంధం చూడండి" ఇది యొకటే వేంకటసుబ్బమ్మ మాట. "చూస్తాను" అని పంతులు కోర్టునకు వెడలిపోయెను.

పంతులును, చెంచురామయ్యయు ఆనకట్ట దెసకు షికారునకు పోయి చాలసేపు ఆలోచించిరి. "మఱేమీ లేదు. నాకు లేకలేక సుబ్బలక్ష్మి మాత్రమే పుట్టినది. నా యాస్తి మూడులక్షలకి తక్కువలేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇదంతా అమ్మాయికే చెందుతుంది. నాకు మఱో వుద్దేశం లేదు. ఆడపిల్ల అను మిషతో, కడుపున పుట్టిన బిడ్డను త్రోసివేసి ఆస్తి అంతా దత్తుడికియ్యడం నాకు యిష్టంలేదు. దౌహిత్రుడు వుంటే పరలోకాలకి లోటు కలుగదు. కనక ఇంత యాస్తితో అంత మంచిపిల్లని యిచ్చేటప్పుడు వరుడు సర్వాంగసుందరంగా వుండాలి. లేకపోతే లోకం నిందిస్తుంది" అని పంతులు చెప్పెను. "మీకు తెలవనిది లేదు. సుబ్బలక్ష్మిని సామాన్యుడికి యిస్తే చాలా అక్రమం అనిపించుకుంటుంది. అన్నివిధాలా జమీందార్ల యింట్లో పడవలసిన పిల్ల. జాగ్రత్తగా ఆలోచించాలి" అని చెంచురామయ్య బదులు చెప్పెను. రాత్రి యెనిమిదిగంటల వఱకును వారక్కడనే కూర్చుండి యోచించిరి. లేచుచులేచుచు చెంచురామయ్య ఒక సంబంధమును చూపెను. "రాజమహేంద్రవరం - దూరం అంటే చెప్పలేను. అక్కడ వక జమీందారురాలు వుంది. పిల్లవాడికి యింకా మైనారిటీ వదలలేదు. యాభైవేలు

వస్తాయి. ఆ సంబంధం అన్ని విధాలా బాగుంది" అని యాతడు చెప్పగా పంతులు "బాగుంది" అనియెను.

భోజనానంతరము అందఱును ఒకచోగూర్చుండి చర్చించిరి. పురోహితుని వెంట నిడుకొని చెంచురామయ్య రాజమహేంద్రవరము వెళ్ళి మాట్లాడి వచ్చుటకు నిశ్చయమయ్యెను. "వారి సంబంధమే అయితే పెళ్ళికి యాభైవేలు ఖర్చు పెడతాను" అని పంతులు సావష్టంభముగ బలికెను.

## 9

మఱునాడు యథానిశ్చితముగ పురోహితుడును, చెంచురామయ్యయు పాశెంజరుబండిలో రాజమండ్రీ వెడలిపోయిరి. మధ్యాహ్నము రెండుగంటల వేళ పంతులు హాలులో కూర్చుండి యొక పెద్దమనుష్యునితో మాట్లాడుచుండెను. కొంతసేపు అగునప్పటికి కొంచెము నింపాదిగా లోపలినుండి "అయ్యో, ఏలాగమ్మా?" అని చింతావచనములు వినవచ్చెను. ఉత్తరక్షణమునందే వేంకటసుబ్బమ్మ లోగుమ్మములో నిలిచి "మీరొకమాటు లోపలికి తొరగా రావాలి" అని పిలిచెను. ఆమాటయందు చాల ఆత్రము తొణుకులాడుచుండెను.

ఎదురుగా నిలిచి "యేమీ" అని పంతు లడిగెను; గాని వేంకటసుబ్బమ్మ అక్కడ నిలువక ఆతనిని లోపలకు తీసికొనిపోయి "అమ్మాయి రజస్వలయైనది" అనియెను. పంతులు అది విని నిరుత్తరుడై యుండగా ఆమె మఱల "కొంప మునిగిపోయింది" అనియెను. "ఏమి" యని యాతడడుగగా "ఇంకా నింకా అలా అడుగుతారేమిటీ? మర్యాద గంగలో కలిసిపోతేనూ?" అని విసుగుగా నడిగెను.

"అమ్మాయి రజస్వల అవడం యేమిటి? మర్యాద పోవడమూ, కొంప ములగడమూ యేమిటీ?"

"అలా అంటారేమిటండీ?"

"ఇలా యెందుకు జరిగిందో తెలవదు. విచారించకు తప్పు. జరగవలసిన ఉత్సవం అంతా చెయ్యి"

"ఉత్సవమా?"

"తప్పేమీ?"

"సిగ్గు సిగ్గు"

"వూరుకో. చెప్పినట్లు చెయ్యి"

ఇట్లు వారివురును చాలతడవు వాదోపవాదములు గావించుకొనిరి. వేంకటసుబ్బమ్మ యీ సంగతి యింతవఱకును రంగమ్మకు చెప్పకుండ రహస్యముగ నుంచెను. భర్త యనుజ్ఞ చొప్పున నప్పుడు ఆమె పిలిచి చెప్పగా రంగమ్మ తెల్లవోయెను.

"అత్తగారూ, విచారించవలసినది యేమీ లేదు. పూర్వకాలం గాదిది. ఈశ్వరనిర్ణయం యిలా వుంది. కాలానికి మనం అడ్డుపడలేము. జరగవలసిన ఉత్సవాలన్నీ చెయ్యమన్నాను".

"మీరిలా అనడం ఆశ్చర్యంగా వుంది."

"ఏమీ?"

"మీ జపతపాలూ, మీ నిష్ఠాచూసి అందఱూ ఆశ్చర్యపడుతున్నారు. దానికి ఇది విపరీతంగా వుంటుంది."

"అయితే యిప్పుడు చేయవలసింది యేమిటీ?"

"పెద్దలు చెప్పినట్లు మనం యిప్పుడు నడుచుకోలేము. నిజమే"

"మీకు తెలవని దేమీ లేదు."

"తెలిసినా తెలవకపోయినా యిప్పుడంతా కాలాన్ని అనుసరిస్తున్నారు. శాస్త్రాలకీ, నడతలకీ చాలా దూరం వుందని మీ మామగారు చెబుతూ వుండేవారు. లోకంలో చాలామంది పిల్లలు యిలాగే పెళ్ళికాకుండానే రజస్వల అవడం వుంది; గాని వారంతా రహస్యం దాచుచున్నారు."

"మా విషయంలో మీ అభిప్రాయం యేమిటీ?"

"పాపం అన్నప్పుడు దాస్తే మాత్రం పోతుందా"

"బుద్ధిపూర్వకంగా పాపం చెయ్యడం తప్పు. తప్పుని కప్పిపుచ్చడానికి అబద్ధమాడడం అంతకంటే తప్పు. దాచడం నాకు యిష్టం లేదు."

"అవును ఈశ్వరనిర్ణయం యిలా వుంది, ఎవరేం చెయ్యగలరూ? మీధైర్యం యెంతవరకూ వుందో చెప్పలేను"

"సంఘం కొంతవరకూ వ్యతిరేకిస్తుంది; గాని నన్ను యెదిరించి నిలవలేదు"

"ఆధైర్యం మీకు వుంటే జరిగింది యెలాగా జరిగిపోయింది కనక యిక చాటు యెందుకూ?"

"నాకు నచ్చిన మాట చెప్పేరు మీరు. నా మాటకేంగాని నిజంగా మీవిచక్షణతా, మీ ధైర్యమూ అసాధారణంగా వున్నాయి. మీ అమ్మాయికి ధైర్యం చెప్పండి."

"మీరు అలా చెబుతూ వున్నప్పుడు నాకు మాత్రం అధైర్యం యెందుకూ?"

"వివేకం అంటే అదీ. లక్షలు వెలగల మాట అన్నావు. ఆడవాళ్ళంతా యిలా ధైర్యంగా నిలవబడితే సంఘం మళ్ళీ హుటాహుటి నడకలతో బాగుపడుతుంది."

"సన్నాయి వాళ్ళని పిలిపించండి."

## 10

భార్య ధైర్యమునకు బ్రహ్మానందపడుచు చెంచయ్య యీవలకు వచ్చి జరిగిన సంగతి కూర్చున్న పెద్దమనుష్యునకు చెప్పెను. పెళ్ళికాని పిల్ల రజస్వలయైనందుకే కాక పంతులు ఆనందించుచున్నందులకు - పరితాపపడకుండ - మహోత్సాహముతో తనకామాట చెప్పినందులకు ఆ మనుష్యుడు చాల ఆశ్చర్యపడెను. ఆతడును ఇంగ్లీషు చదువుకొనినవాడే గాని సంఘమునకు చాల భయపడువాడగుటచే అక్కడ కూర్చుండుట అపాయకరమని భావించి వచ్చిన పని కాకుండగనే సెలవు పుచ్చుకొని వెడలిపోయెను.

సన్నాయివాళ్ళు వచ్చిరి. ఈ సంగతి విని పిలువక మునుపే యిరుగుపొరుగు స్త్రీలు కొందఱు వచ్చిరి. చేయవలసిన లాంఛనములు అన్నియునైన తరువాత వేంకటసుబ్బమ్మ బంధువులను, చెలులను, ఇరుగుపొరుగు వారిని పిలిచికొని వచ్చెను. చాలమంది వచ్చిరి. జరుగవలసిన వేడుకలన్నియు జరిగినవి.

పురమంతయు ఇదేమాట యయ్యెను. ఇంతవఱకును నెల్లూరున సంఘమున ఇట్టి సాహసకార్యము జరుగలేదు.

## 11

ఏమియు లోటు జరుగలేదు. అంతయు సలక్షణముగనే జరిగెను. ఇక పెళ్ళి సంగతియెట్లని పంతులు ఆలోచించుచుండగా చెంచురామయ్యయు, పురోహితుడును, రాజమహేంద్రవరమునుండి వచ్చిరి. వారి వెంట జమీందారుగారి రాయబారులు వచ్చిరి. చెంచురామయ్యను చూచుటతోడనే చెంచయ్య "అమ్మాయి రజస్వలయైనది" అనియెను. అందఱును ఆశ్చర్యపడిరి. వచ్చినవారిని కూర్చుండజేసి పంతులు చెంచురామయ్యను లోపలకు తీసికొనిపోయెను. ఈ యవకాశమున వచ్చినవారు "ఇంకెందుకు మేమూ?" అని పురోహితునితో చెప్పి వెడలిపోయిరి. పంతులు వారు వెడలిపోవుట విని "పోనీయండి" అనియెను.

## 12

పంతులు నాలుగైదు సంబంధములకోసము ప్రయత్నించెను; గాని అందఱును తిరస్కరించిరి. "ఇంక లాభంలేదు" అని యొక రాత్రి అంతయు భార్యయు భర్తయు ఆలోచించుకొనిరి. తెల్లవారిన తరువాత వేంకటసుబ్బమ్మను మేడమీదికి తీసికొనిపోయి చాలసేపు మాట్లాడెను.

ఎనిమిది గంటలయ్యెను. రంగమ్మ వంటప్రారంభించి అప్పుడే యెసరు పెట్టెను. చెంచురామయ్య కక్షిదారులతో మాట్లాడుచుండెను. అప్పుడు

వేంకటసుబ్బమ్మయు, చెంచయ్యపంతులును రంగమ్మ వద్దకువెళ్ళిరి. "కూచోండి" అని యామె పీటలు పరువగా యిరువురును కూర్చుండిరి. పంతులు పిలువగా చెంచురామయ్య వచ్చి కూర్చుండెను.

"పిన్నీ; నేను నీకు కొత్తగాదు. నా అభిప్రాయాలు నీకు మొదటినుంచీ తెలిసే వున్నాయి. మఱేమీ లేదు. సుబ్బలక్ష్మిని తమ్ముడికి ఇవ్వడానికి నిశ్చయించుకొన్నాము"

"ఇదేమిటి అక్కయ్యగారూ?"

"అమ్మాయీ; నీకు తెలవంది లేదు. మనము వియ్యం అందడం తప్పుని గాదు. పిల్ల రజస్వల అయినందుకూ గాదు. తారతమ్యం చూడూ. స్వర్గంలో మీరు వున్నారు. పాతాళంలో మేము వున్నాము."

"అంతా ఆలోచించాము. లక్షలు వుండి మేమెంత తింటున్నామో లేక మీరూ అదే తింటున్నారు. ఇలాంటి ఆక్షేపణలు చెప్పవద్దు. సుబ్బలక్ష్మి తమ్ముణ్ణిగాని పెళ్ళాడనంటూ వుంది."

అంతయు నిశ్చయ మయ్యెను. వరనిర్ణయము తెలియనీయకుండ పంతులు వివాహప్రయత్నములన్నియు చేసెను. చైత్రశుద్ధ పంచమీ సోమవారము రాత్రి అయిదు గడియలకు ముహూర్తము నిశ్చయమయ్యెను. బంధువులలో చాల తక్కువమంది మాత్రమే వచ్చిరి. రాజమహేంద్రవరమునుండి హితకారిణీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మగపెళ్ళివారి పక్షమున పెండ్లి పెద్దయై వచ్చెను.

దేవదుందుభులు మ్రోగునట్లు వివాహము అయ్యెను. పురమునందలి బ్రాహ్మణులలో సగము వచ్చి నిరాక్షేపణముగ భోజనములు చేసిరి. తెనుగుపత్రికలన్నియు, చెంచయ్య సాహసమును పొగడెను. మిత్రులుగూడ పొగడిరి.

❀ ❀ ❀